క్లుప్తంగా

పణుకుపేట కాలనీలో తప్పిన ప్రమాదం

సీతానగరం: మండలంలోని పణుకుపేట ఎస్సీ కాలనీలో ఆదివారం త్రుటిలో ప్రమాదం తప్పింది. విద్యుత్ ఎల్‌టీ లైన్ ఖాసారం మీద పడడంతో స్తంభానికి విద్యుత్ సరఫరా అయింది. ఆ సమయంలో ప్రజలెవ్వరూ ఆ ప్రాంతంలో సంచరించకపోవడంతో ఎటువంటి ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది సమస్యను పరిష్కరించారని సర్పంచ్ బంకురు పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీహరినాయుడు తెలిపారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణంలో తాగునీటి సరఫరాకు సోమవారం అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిని ప్రధాన నీటి సరఫరా కేంద్రం వద్ద 4వ నంబరు ఇన్‌ఫిల్ట్రేషన్ బావిలో మోటార్ మరమ్మతులకు గురైనందున తాగునీటి సరఫరా నిలిచిపోనున్నట్లు పేర్కొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

సీతంపేట: మండలంలోని నారాయణగూడ సమీపంలో 400 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. అలాగే ఓవర్‌లోడులో వెళ్తున్న ఐదు ఆటోలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అలరించిన కోలాటం

భామిని: మండలంలోని సింగిడిలో వినాయక మండపం వద్ద ఆదివారం భామిని కళింగ వైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. కళింగ వైశ్య సంఘ మండల నాయకులు గుడ్ల షణ్ముఖరావు, తాళాసు మధు పర్యవేక్షణలో కోలాటం ప్రదర్శన చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా మందిరంలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. బాబాకు ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు, తదితర పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తె నరసింహాచార్యులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అలాగే దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పడవ ప్రయాణం



పూర్ణపాడు వద్ద నడుపుతున్న మరబోటు

కొమరాడ: కొమరాడ నుంచి కొట్టు, పూర్ణపాడు నుంచి లాబేస్ వద్ద నాగావళి నదిపై నడుపుతున్న మరబోట్లను అధికారుల పర్యవేక్షణతో నడపాలని సీపీఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. పూర్ణపాడు వద్ద నాగావళి నదీ తీరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్పపీడనం ప్రభావంతో నాగావళి నది ప్రవాహం పెరుగుతోందని, ఈ సమయంలో మరబోట్లపై ప్రయాణం ప్రమాదకరమని అన్నారు. అధికారులు స్పందించి బోటు ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు అందించాలని కోరారు. అలాగే పూర్ణపాడు–లాబేస్ వంతెన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి అటు వైపు ఉన్న 9 పంచాయతీ ప్రజల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సీతంపేట: ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిడ్డిక నారాయణరావు అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులు, వయోజనులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వయోజన విద్య ఆవశ్యకత, నిరక్షరాస్యత నిర్మూలనకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

బొబ్బిలి: ఏపీటీఎఫ్ ఆవిర్భవించి, 80 వసంతాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో భాగంగా స్థానిక ఇండోర్ స్టేడియంలో ఆదివారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఏపీటీఎఫ్ నాయకులు తెంటు సత్యంనాయుడు, సీహెచ్ రామారావు, కె.గోపాలకృష్ణనాయుడు, బి.సుధాకరరావులు ఈ పోటీలు ప్రారంభించగా, దత్తిరాజేరు, తెర్లాం, బాడంగి జట్లు వరుస స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి సెప్టెంబరు 14వ తేదీన జరిగే ఏపీటీఎఫ్ మహాసభలో బహుమతులు అందజేస్తామని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గంట సత్యనారాయణ తెలిపారు.

పార్వతీ తనయా పాహిమాం..

పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో ఘననాథుడి ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభయ్యాయి. భక్తులు ఇళ్లల్లో పూజలు నిర్వహించుకోగా... గ్రామాల్లో, ముఖ్య కూడళ్ల వద్ద వినాయక మంటపాలు వెలిశాయి. వివిధ ఆకృతుల్లో ఉన్న భారీ విగ్రహాలను మంటపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. పలుచోట్ల నిర్వాహకులు అన్నదానాలు నిర్వహించారు. పార్వతీపురం పట్టణంలో ఏర్పాటు చేసిన పలు మంటపాలను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సందర్శించి, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. – పార్వతీపురం/సాలూరు నెట్‌వర్క్



సాలూరు: నాయిబ్రాహ్మణవీధిలో త్రిమూర్తులతో కలిసి సప్తర్షులతో కొలువుదీరిన గణపతి



పార్వతీపురం టౌన్: బెలగాం డీవీఎం స్కూల్ సమీపంలో పార్వతీ పరమేశ్వరులతో గణనాథుడు



పార్వతీపురం టౌన్: మేదరవీధిలో ధ్యాన శంకరుని రూపంలో స్వామివారు



పార్వతీపురం టౌన్: పట్టణంలో కొలువుదీరిన వినాయకుడు



పార్వతీపురం టౌన్: పశుపతినాథ్ ఆలయంలో కొలువుదీరిన వినాయకుడు



సాలూరు: దుర్గానవీధిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ రూపంలో..



సాలూరు: అక్కేన వీధిలో కొలువైన వినాయకుడు



సీతానగరం: వెలమవారి వీధిలో కొలువుదీరిన బొజ్జ గణపయ్య



సాలూరు: గొల్లవీధిలో..



మక్కువ: గణనాథున్ని మోసుకుంటూ వెళ్తున్న భక్తుడు



సీతానగరం: కామందొరవలస వినాయక మంటపం వద్ద అన్న సంతర్పణ



సీతానగరం: తామరఖండి శివాలయం వీధిలో అన్నదానం



మక్కువలో వినాయక చవితి సంబరాల్లో మావుడి సోదరులు



మక్కువ: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కేజీబీవీ విద్యార్థులు



పార్వతీపురం టౌన్: పట్టణంలో వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విజయ చంద్ర



సీతానగరం: గుచ్చిమి కొత్త రామమందిరంలో గణపయ్యను మొక్కుతున్న విద్యార్థులు



మక్కువ: ఎం.పాలికవలసలో గణపతి మండపంలో పూజలు చేస్తున్న భక్తులు



సాలూరు: నాయుడువీధిలో గోవర్ధన గిరిని ఎత్తిన శ్రీకృష్ణుడిగా కొలువుదీరిన గణనాథుడు

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

సీతానగరం: లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ కార్మికులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని శ్రీరామా సుగర్ మిల్లు లేబర్ యూనియన్ నాయకుడు ఎస్.కొండలరావు కోరారు. ఈ మేరకు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ, 2021 క్రషింగ్ సీజన్‌లో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. అలాగే ఉద్యోగ విరమణ చేసి మృతి చెందిన వారికి ఎటువంటి ఆర్థిక సాయం చేయలేదని, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారికి కూడా జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే జయకృష్ణ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న సుగర్ ఫ్యాక్టరీ కార్మిక నాయకులు

తెగుళ్లపై అప్రమత్తం

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న వరి పంటకు తెగుళ్ల సోకే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ ఎస్. అవినాష్ సూచించారు. మండలంలోని కాశీపేట, చినబోగిలి గ్రామాల్లో ఆదివారం పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వరి పంటకు ఆకుముడత తెగులు సోకుతోందన్నారు. ఈ పురుకు ఆకును తెల్లగా గీత గీచినట్లు తినడం వల్ల పిలకల సాంద్రత బాగా తగ్గిపోతుందని చెప్పారు. దీని నివారణకు లీటర్ నీటిలో 2.5 ఎంఎల్ క్లోరిఫైరిపాస్ లేదా 2 ఎంఎల్ ఇమిడాక్లోరఫిడ్ కలిపి ఎకరాకు 14 నుంచి 16 ట్యాంక్‌ల మందు పిచికారీ చేయాలని తెలిపారు. మండలంలో 17,290 ఎకరాలకు గాను 13,800 ఎకరాల పంట వివరాలను 'ఈ పంట'లో నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో చినబోగిలి వ్యవసాయ సహాయకురాలు బి. సౌజన్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.



వరిచేనులో ఆకుముడత పురుగును పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

పంట నష్టం పరిశీలన

మక్కువ: మండలంలోని శంబర గ్రామ సమీపంలో ఇటీవల వీచిన ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి, మొక్కజొన్న పంటలను తహసీల్దార్ షేక్ ఇబ్రహీం శనివారం పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేయడంతో పాటు బాధిత రైతులతో మాట్లాడారు. నష్టపోయిన పంటలను పూర్తిస్థాయిలో పరిశీలించి, నివేదిక అందించాలని రెవెన్యూ, ఉద్యానవన శాఖ సిబ్బందికి సూచించారు. నివేదకను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ స్వాతి, హెచ్‌డీటీ హేమలత, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, రెవెన్యూ, ఉద్యానవనశాఖ సిబ్బంది ఉన్నారు.



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ షేక్ ఇబ్రహీం

పునరావాస కేంద్రం ఏర్పాటు

వీరఘట్టం: భారీ వర్షాల కారణంగా మండల యంత్రాంగం అప్రమత్తమయ్యింది. వరద బాధితులకు వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పునరావాసం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ వై.వెంకటరమణ తెలిపారు. నదీతీర ప్రాంతాలైన కడకెల్ల, చిట్టపూలివలస, కిమ్మి, చిదిమి, బిటివాడ, పనస నందివాడ ప్రాంతాల్లో తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌ఐ లక్ష్మునాయుడు, ఎస్సై కళాధర్ తదితరులు ఆదివారం పర్యటించారు. వరద ఉధృతిపై స్థానికులను అప్రమత్తం చేశారు. ఏదైనా సమస్య తలెత్తినట్లయితే వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి, పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందివ్వాలని సూచించారు.

వంద ఎకరాల్లో అరటి పంట నష్టం

వీరఘట్టం: భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా మండలంలో వంద ఎకరాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లింది. కంబర, చిటిపలివలస, కంబరవలస గ్రామాల్లో నేలమట్టం అయిన అరటి పంటను తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌ఐ లక్ష్మంనాయుడు, ఏఓ సౌజన్య తదితరులు ఆదివారం పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పడితే మండల వ్యాప్తంగా పంటనష్టాలను పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.



జియ్యమ్మవలస: బాసంగిలో పాక్షికంగా దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సీతారామయ్య, సిబ్బంది

ముంపు ప్రాంత పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి ముంపు ప్రాంతాన్ని తహసీల్దార్ కేవీ సీతారామయ్య సిబ్బందితో కలిసి ఆదివారం పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో నాగావళి నదికి వస్తున్న వరదను పరిశీలించినట్లు తెలిపారు. వర్షాలకు గ్రామంలోని మూడడ్ల ఆదినారాయణకు చెందిన ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.



కంబర సమీపంలో నేలమట్టమైన అరటి పంట

మా సమస్యలు పరిష్కరించు స్వామీ..



వినాయక విగ్రహానికి వినతిప్రతం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కొమరాడ: అయ్యా..! విఘ్నరాజా.. కొమరాడ మండలం ప్రజలు కష్టాలు తీర్చు స్వామీ అని సీఐటీయూ నాయకుడు కొల్లి సాంబమూర్తి వినాయకుడిని వేడుకున్నారు. కొమరాడలోని మరడనా వీధిలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరడి విగ్రహానికి శనివారం వినతప్రతం ఇచ్చారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ.. పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతఃరాష్ట్ర రహదారి పూర్తిగా గోతుల మయం కావడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. గత ఆరేళ్లగా ఒడిశా నుంచి వచ్చిన ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో తిష్టవేసి మనుషుల ప్రాణాలతో పాటు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. నాగవళి నదిపై వంతెన నిర్మించకపోవడంతో పడవలపై ప్రయాణం చేస్తూ ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. పూర్ణపాడు–లాబేస్ వద్ద వంతెన నిర్మాణ పనులు కొన్నేళ్లుగా ఆగిపోయాయి. జంఝావతి రిజర్వాయర్ నిర్మాణం జరగడంలేదు. గుమ్మడి గెడ్డ ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. రాత్రి 7 గంటల తరువాత కొమరాడకు ఆర్టీసీ బస్సు రావడం లేదు. అయినా అధికారులు, ప్రజా ప్రతినిధులు కనీసం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులకు, అధికారులు మంచి బుద్ధిని ప్రసాధించి మా సమ్యలు పరిష్కరించేలా చూడు స్వామీ అని ప్రార్థించారు.

అప్రమత్తంగా ఉండాలి

రాజాం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎక్కడా ఎటువంటి ప్రమాదం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఎస్.కె.రాజు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వరదల ప్రభావంపై వీఆర్‌వోలను ఆయన తన కార్యాలయంలో ఆదివారం కలిసి ఆరా తీశారు. ఎప్పటికప్పుడు గ్రామస్తులను అప్రమత్తం చేయాలన్నారు. తుపాను సహాయక చర్యల నిమిత్తం తహసీల్దారు కార్యాలయం వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తమను సంప్రదించాలని తహసీల్దారు తెలిపారు.

వర్షాలు తగ్గాక ఇసుక పంపిణీకి చర్యలు

భామిని: వంశధార ప్రాజెక్ట్ ఓపెన్ హెడ్ చానల్ సైడ్‌వియ్యర్ నుంచి తీసిన ఇసుక నిల్వలను వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పంపిణీ చేపట్టాలని పాలకొండ సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి సూచించారు. కాట్రగడ ఓపెన్ హెడ్ చానల్‌ను జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడుతో కలిసి శనివారం సందర్శించారు. ఓపెన్ హెడ్ చానల్ సైడ్ వియ్యర్‌లో పేరుకుపోయిన ఇసుక మేటల తొలగింపును పరిశీలించారు. లక్ష మెట్రిక్ టన్నుల వరకు ఇసుక సేకరణకు అవకాశం వంశధార అధికారులు స్పష్టం చేశారు. సేకరణ జరుగుతుండగానే ఇసుక పంపిణీ చేసే ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ నిమ్మల శేఖరంనకు ఆదేశించారు. నేరడి–బి సచివాలయంలో బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేశామని, నిబంధనల మేరకు బుకింగ్ చేపడతామన్నారు. మండల డీటీ రమేష్‌కుమార్, సర్వేయర్ రాజేశ్వరరావు, ఆర్‌ఐ రాంబాబు, వీఆర్‌ఓలు భారతి, వెంకటరమణ, వంశధార సిబ్బంది ఉన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్వో కేశవనాయుడు